# బాబోయ్ టెలిఫోన్!

"ఏంటండీ రాస్తున్నారు?" స్థూలకాయాన్ని మోసుకుంటూ వచ్చి అడిగింది భాగ్యలక్ష్మి భర్త కనకారావుని.

"అడిగావ్! ఇంక అఘోరించినట్లె!" మొఖం చిట్లించి అడిగిన దానికి కసురుకున్నాడు కనకారావు

"అయినా నా కెందుకు లెండి! ఏం రాసుకుంటె-! పెళ్ళానికి చెప్పకూడనివి ఉంటాయి..చెప్పేవి ఉంటాయి. మగ మహారాజులు బయట ఏ రాచకార్యాలు వెలగ బెడుతున్నారో..ఏం చేస్తున్నారో మాకెందుకు?" మూతి తిప్పుకుంటూ దెప్పిపొడిచింది.

"నీ దుంపతెగ! ఇదేవన్న లవ్వు లెటర్ అనుకుంటున్నావా?"

"కనపడ్డంలా? ప్రింటయిన ఆకుపచ్చ అక్షరాలున్న ఫారము..." చిర్రెత్తు కొచ్చింది కనకారావుకి.

"ఏమోనమ్మ! నల్లని వన్నీ నీళ్ళు.. తెల్లని వన్నీ పాలు అనుకునే కాలం కాదిది. లవ్వు లెటర్లు కూడా ప్రింట్ చేసి అమ్ముతున్నారని నాకేం తెల్సు."

"ఒసే! ఒసే! నిన్నుకాదే! మీ అయ్యని..నాకీ గుదిబండని అంటగట్టి నందుకు తిట్టుకోవాలి."

"అయ్యో! అయ్యో! ఆయనిప్పుడేం చేశాడని!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది. "సరిపడకపోతే శ్రీరామ అన్నా బూతు మాటె! నేనిప్పుడే మన్నానని..."

దీర్ఘాలుతీస్తున్న భాగ్యలక్ష్మిని ఓదార్చడానికి చాలా సేపు పట్టింది కనకారావుకి. చివరికి చెప్పాడు.

"దీన్ని టెలిఫోన్ దరఖాస్తు ఫారం అంటారు- ఫోన్ కనెక్షన్‌కు అప్లై చేస్తున్నాను."

"ఎట్టా! మీకేమైనా మతి పోయిందా! క్రితం సంవత్సరం వస్తే వద్దని అమ్మేశారుగా!" విస్తుపోయింది.

"నాకుండీ నీకు పోయింది - అసలు ఉంటేగా మన కెందుకీ ఫోన్? మన కెవడిస్తాడు?" విసుక్కున్నాడు.

"అయ్యోరామ! మళ్ళీ అదే మాట మరి మనకు ఎందుకు ఫోన్?"

"ఓసి వెఱ్ఱిమొద్దు మనకి కాదే యిది-కనెక్షన్ రావడానికి ఒక సంవత్సరం పడుతుంది.. అప్పుడు..."

"ఎంచక్కా బెడ్ రూమ్‌లో పెట్టుకుని అడ్డమైన వాళ్ళతో కులకచ్చు". పూర్తి చేసింది భాగ్యలక్ష్మి భర్త ప్రవర్తన మీద నమ్మకం లేక.

"చెప్పు తీసుక్కొడతా! మళ్ళీ అదే మాట!"

"నా తలరాత- అలా తగలడింది."

"రాతకేం చాలా బాగుంది. ఇది సక్సెస్ అయితే నీకు ఒక నెక్లస్ చేయిస్తాను."

"ఆ! ఎంత మంచివారండి-ఎలా?"

"ఈ ఫోన్ కనెక్షన్ రాగానే - ఎంచగ్గా-కావాల్సిన వాళ్లకు బ్లాకులో అమ్మేద్దాం- ఓ పదివేలకు."

"ఆ! పదివేలే!"

"ఆ! మరి రాబోయే డిమాండ్ అలా ఉంది."

"ఛ్ఛ! మీకు బుర్ర లేదండి!" నిట్టూర్చింది.

"ఏం? నీకేమైనా అనుమానంగా ఉందా?"

"లేకపోతే ఏంటండి? క్రితంసారి ఐదువేలకు కాంతారావుకు మన ఫోన్ అమ్మేసి ఊరుకున్నారు. అది కూడా ఉంటె ఇరవైవేలు వచ్చేవిగా."

"నీ ఆశమాడ! అప్పుడు అలాగే నడచింది మార్కెట్! అయినా ఆ అయిదు వేలకి నీకోసమని గాజుల జత చేయించానుగా! బంగారం ధర అంగారంలా మండిపోతూనే ఉంది." ఓదార్చాడు.

"పోస్ట్! కనకారావు గారున్నారా?" వీధిలో పోస్ట్‌మెన్ గావుకేక పెట్టాడు.

"అయ్యా! నిక్షేపంగా ఉన్నాను ఏం నేనే ఉండడం నీకిష్టం లేదా?" కనకారావు ధుమ ధుమ లాడుతూ బయటకు వచ్చాడు.

"చాల్చాల్లే! ముందు ఆ కవరియ్యవయ్యా!" రీ డైరక్టయి వచ్చిన రిజిష్టర్ కవరు తీసుకొని కాగితంలో సంతకం పెట్టాడు.

"ఏమండీ! అబ్బాయి నించి డీ-డీఏమైనా వచ్చిందా?" సంబరపడిపోతూ అడిగింది.

కవరు చింపి చదివి శిలాప్రతిమలా నిలబడిపోయాడు కనకారావు.

"ఏమిటండీ అలా అయి పోయారు?" దగ్గర్లో ఉన్న నీళ్ల చెంబులోని నీళ్లు తీసుకుని ముఖాన నీళ్లు కొట్టింది.

కాసేపటికి తేరుకొని- నీర్సంగా కుర్చీలో కూర్చొని కళ్లు మూసుకున్నాడు రిజిష్టర్ లెటర్ జేబులో పెట్టుకొని.

"ఈ కాంతారావంత పుండాకోరు వెధవ లేడు వట్టి వెధవ!"

"మధ్యలో అతనేం చేశాడండి?"

"టెలిఫోన్ బిల్లులు కట్టలేదుట ! ఒకటా రెండా ఏకంగా పాతిక వేలు ఎగవేశాడు". కోపంగా అన్నాడు.

"వేస్తే వేశాడులెండి! దేశంలో ఎంత మంది పన్నులు కట్టకుండా ఎగ్గొట్టుతున్నారో! వాళ్లల్లో ఈయన ఒకడు!" చాలా తేలిగ్గా అంది.

"నీ బొంద! వాడు ఎగ్గొడితే మనం కట్టాల్సి వస్తుందే పాపిష్టిదానా!"

"ఆఁ!" అవాక్కైరాలైపోయింది.

"ఆ ఫోన్ మన పేరు మీద ఉంది యింకా. కేవలం అడ్రస్ మార్చి కాంతారావు తీసుకున్నాడు - బిల్లు సక్రమంగా చెల్లిస్తాడు మనకి పూచీ లేదనుకున్నా కాని యిలాంటి వెధవ పని చేస్తాడనుకోలేదు."

"ఏం రాసుందండి అందులో?"

"బకాయి పడిన పాతికవేలు నెల లోపున కట్టకపోతే చట్టరీత్యా మాచే తీసుకోబడు చర్యలకు మీరు అర్హులవుతారని రాసుంది. సర్లే! నే పోయి ముందు కాంతారావుని కల్సి వస్తాను తలుపేసుకో!"

కాంతారావు ఇల్లు తాళం వేసుంది. చుట్టు ప్రక్కల వాళ్ళని వాకబు చేశాడు. బిజినెస్ నష్టం వచ్చిందని ఓ అర్ధరాత్రి ఊరు విడిచి వెళ్లి పోయాడుట, పెళ్లాం బిడ్డలని వదిలేసి. వాళ్లు వీళ్లు చేరి వాళ్లను పుట్టింటికి పంపించేశారుట.

కనకరావుకి కాళ్లు చేతులు ఆడలేదు. కాసేపటికి తన లాయరు ఫ్రండ్ షణ్ముగం గుర్తుకొచ్చాడు. రిక్షా తీసుకుని అతనింటికి బయలు దేరాడు. మిణుకు మిణుకు మంటున్న ఆశతో.

"ఏమోయ్ కనకారావు దారి తప్పి వచ్చినట్లున్నావు!" షణ్ముగం ఆకు వక్క నములుతూ ఆహ్వానించాడు.

"కోర్టు లేదా!"

"బంద్! న్యాయానికి బంద్ యివ్వాళ". నవ్వాడు.

"నువ్వే కాపాడాలి!" బిక్క మొహం పెట్టుకుని చెప్పాడు.

"ఎప్పుడూ పులిలా ఉండేవాడిని... ఇప్పుడిలా పిల్లిలా.." ఆశ్చర్యపోయాడు.

"ఈనోటిస్ చూడు, కాంతారావు చేసిన యస్. టి. డీలు నా కొంపముంచాయి."

చదివిన షణ్ముగం మొహంలో విపరీతంగా ఆశ్చర్యం కనిపించింది. ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆ ఫోన్ బిల్లు.కాంతారావు అనే వాడికి అమ్మేశాను."

"మరి బిల్లు నోటిస్ నీ పేరుమీద ఉందేమిటి?"

"అమ్మడమంటె బ్లాకులో అయిదు వేలు తీసుకుని యిచ్చేశాను."

"అదీ డిపార్ట్‌మెంట్‌కు సరెండర్ చెయ్యకుండా!"

"ఐ. సీ! అంటే షిఫ్టింగ్ ఛార్జీలు పేచేసి, అడ్రస్ మార్చి?"

"ఆ(!అదేదో ఆ కాంతారావే చూసుకున్నాడు. నాకు సంబంధం లేదనుకున్నా. కానీ ఈ రోజిలా....". దాదాపు ఏడ్చేశాడు.

"మరి కాంతారావుచేత కట్టించక పోయావా?"

"కట్టిద్దామనేపోయాను. కానీ అతను లేడు!"

"ఎక్కడికి పోయాడు"

"జి. ఓ. కె"

"అంటే?"

"గాడోన్లీ నోస్! దేవుడికే తెలియాలి."

"అయితే నీకు తప్పదు" -కాసేపటికి అన్నాడుషణ్ముగం పుస్తకాలు తిరగవేసి.

"బాబ్బాబు! నీ ఫీజు నువ్వుఅడిగినంత ఇచ్చుకుంటాను. ముందు దీన్ని తప్పించు."

"ట్రై చేద్దాం! ఇటు వంటి కేసుల్లో కాలం వెళ్లబుచ్చడం తప్ప పూర్తిగా నివారించలేం! లెటజ్ సీ"! విచారంగా చెప్పాడు లాయర్.

నల్లబడిన మొహంతో రిక్షాదిగి రాగానే కనకారావు-టెలిఫోన్ కనెక్షన్ అప్లికేషన్ పరపరా [illegible]ంటే భాగ్యలక్ష్మి బిత్తరపోయి చూస్తూ నిల్చుంది. ★

ఆంధ్రసచిత్ర వార పత్రిక

